ఆటో కార్మికులను ఆదుకోండి


మహేశ్వరంలో నిరసన చేపట్టిన ఆటో కార్మికులు

మహేశ్వరం: ఆటో కార్మికులకు నెలకు రూ.20 వేల జీవన భృతి కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన నేపథ్యంలో ఆటో నడిపే కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. ఆటోలో ఎక్కేవాళ్లే కరువయ్యారని కనీసం డీజిల్, పెట్రోల్ ఖర్చులు కూడా రావట్లేదన్నారు. దీంతో ఆటో కార్మికుల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉపాధి తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని ఆటోలు నడుపుతున్నారన్నారు. ప్రభుత్వ విధానంతో పూట గడవని పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు జీవన భృతి కల్పించి, ప్రతి ఆటో కార్మికులకు రూ.25 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఏర్పుల శేఖర్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

సర్కిల్-3లో 'చెత్త' శుద్ధి ఏదీ?

- కాలనీల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- దీనికి తోడు పందుల సంచారం
- అనారోగ్యం పాలవుతున్న జనం

చెత్త తొలగింపుపై అధికారుల నిర్లక్ష్యం


మన్సూరాబాద్‌లో పేరుకపోయిన చెత్త


సామనగర్‌లో సంచరిస్తున్న పందులు

ఎల్‌బీనగర్: అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఎల్‌బీనగర్ సర్కిల్-3 చెత్తకు కేరాఫ్‌గా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఎక్కడ చూసినా చెత్త, పందుల సంచారంతో 'చెత్త సర్కిల్'గా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

◆ ఎల్‌బీనగర్ సర్కిల్-3 పరిధిలో సుమారు 400 కాలనీలు ఉన్నాయి. రోజూ కాలనీలో చెత్తను ఊడ్చిన తర్వాత దానిని చెత్తను డంపింగ్ యార్డుకు అధికారుల తరలించాలి. అధికారులు చిత్తశుద్ధితో పని చేయకపోవడం వల్ల ప్రతి కాలనీలోను చెత్త పేరుకుపోతుంది. అది కుళ్లిపోయి కంపుకొడుతోంది. దీనికి తోడు పందుల సంచారం అధికంగా అధికంగా ఉండటంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి.

అధికారుల క్షేత్ర స్థాయి పర్యటన లేవి?

అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు లేకపోవడం, చెత్తపైన సరైన అవగాహన లేకపోవడం వలన సర్కిల్ పరిధిలో పలు కాలనీలు చెత్తమయంగా మారాయి. చుట్టపు చూపుగా వచ్చి పోతున్న అధికారుల వల్ల సిబ్బందిని చెత్తను సరిగా తొలగించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

◆ అధికారులు కార్యాలయంలో కూర్చొని పర్యవేక్షిస్తే చెత్త సమస్య తీరుతుందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. రోడ్లపై చెత్తను తొలగించక పోవడం వల్ల ఈగలు, దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న పందుల సంచారం....

◆ శివారు కాలనీలో పందుల సంచారం రోజు రోజుకూ పెరుగుతోంది. పలు కాలనీలో చెత్తను సరిగా తొలగించకపోవడంతో వాటిని వ్యర్థాలకు అలవాటు పడిన పందులు కాలనీల్లో గుంపులుగా తిరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

◆ పందువల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ ఇప్పటికైనా అధికారులు ప్రతి రోజూ చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకొని కాలనీలను చెత్త రహితంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

చెత్తను తొలగిస్తున్నాం..

రోజు వారీగా కాలనీలో చెత్తను తొలగిస్తున్నామని ఎక్కడ చెత్త లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. చెత్తను కాల్చే వారిపై కూడా జరిమానా విధిస్తున్నాం. ఉదయం చెత్తను తొలగిస్తుంటే.. మధ్యాహ్నం సమయంలో కొందరు చెత్తను తెచ్చి రోడ్లపై వేస్తున్నారు. చెత్త తరలింపుపై సరైన పర్యవేక్షణ చేస్తాం.

– లావణ్య, సర్కిల్ శానిటేషన్ అధికారి

ప్రజాసమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి


సుధీర్‌రెడ్డిని కలిసి సత్కరిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి, అమర్‌నాథ్ యాదవ్

హస్తినాపురం: నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల శాశ్వత పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఎల్‌బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు విజయభాస్కర్‌రెడ్డి, అమర్‌నాథ్ యాదవ్‌లతో కూడిన బృందం మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, కాలనీ సంక్షేమ సంఘాలు అభివృద్ధికి పాటుపడాలని, ఆయా కాలనీల్లో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ కోశాధికారి రాహుల్‌సాగర్, ఉపాధ్యక్షుడు వంగాల రవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్, లాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దశరథరెడ్డి, నరసింహారావు పాల్గొన్నారు.

ఉచిత బస్సుల సంఖ్యను పెంచాలి


బీఎన్‌రెడ్డి నగర్ బస్ షెల్టర్ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

ఎల్‌బీనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సులను తగ్గించకుండా మరిన్ని బస్సులను పెంచాలని బీఆర్ఎస్ యూత్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరం నర్సింహారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో ఉచిత బస్సుల సంఖ్యను తగ్గించవద్దని, వాటి సంఖ్యను పెంచాలని కోరుతూ బీఎన్‌రెడ్డినగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉచిత బస్సుల సంఖ్యను తగ్గించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఉచిత ప్రయాణం వల్ల ఎంతో మంది పేద మహిళలు పైసా ఖర్చు లేకుండా సొంతూళ్లకు వెళ్తున్నారని, ఈ బస్సులను తగ్గిస్తే మహిళలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. నిరసన కార్యక్రమంలో కొట్ట గిరధర్, నాగార్జునగౌడ్, శ్రీకాంత్, వినోద్, శశిపాల్‌రావు, యాదగిరి, నరేష్‌గౌడ్, రాజు, సాగర్ పాల్గొన్నారు.

కెమికల్స్ డంపింగ్ చేసేవారిపై కఠిన చర్యలు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


మార్నింగ్‌వాక్‌లో హిమపురి కాలనీలోని చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీల్లో రసాయన వ్యర్థాలు డంపింగ్ చేస్తున్న కెమికల్ కంపెనీలపై చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హిమపురి కాలనీ, సెవన్‌హిల్స్, డీపీనగర్, ద్వారకా నగర్, ఆటోనగర్ డంపింగ్ యార్డులో ఆయన మంగళవారం కాలనీ వాసులతో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు తమ కాలనీకి కొందరు రాత్రి వేళలో కెమికల్ తీసుకొచ్చి డంపింగ్ చేస్తుండటంతో కాలుష్య సమస్య ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అలాగే కొందరు జంతు కళేబరాలను తీసుకొచ్చి రోడ్ల పక్కన వేస్తున్నారని చెప్పారు. కాలనీల్లో కుక్కల బెడద కూడా తీవ్రంగా ఉందన్నారు. కాలనీలో కెమికల్ డంపింగ్ చేయకుండా రాత్రి వేళలో సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేస్తామని కాలనీల వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రోడ్ల పక్కన జంతు కళేబరాలను వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీకి రూ.7 కోట్లు మంజూరు చేశామని, త్వరలో స్టామ్ వాటర్ లైన్ నిర్మాణం చేసి ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, జగదీష్‌యాదవ్, బాలరాజు, మార్గం రాజేష్‌తోపాటు పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నేతలు


విమానాశ్రయంలో కాంగ్రెస్ యువజన నేతలు

బడంగ్‌పేట్: యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి పిలుపు మేరకు ఈ నెల 20న తలపెట్టిన సంసాద్ ఘేరావ్ పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి బడంగ్‌పేట కార్పొరేషన్ నుంచి యువజన నేతలు ఢిల్లీలోని జంతర్ మంతర్‌కు తరలివెళ్లారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వంగ లక్ష్మీకాంత్‌రెడ్డి, బడంగ్‌పేట నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షుడు గుడుపల్లి పెంటారెడ్డి, మహేశ్వరం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి వెళ్లారు.

భూలక్ష్మీనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు


భూలక్ష్మీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, జలమండలి అధికారులు

వనస్థలిపురం: భూలక్ష్మీనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డ్రైనేజీ సమస్య విషయమై కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం కార్పొరేటర్ జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం నిధులు మంజూరు అయినా పనులు ప్రారంభం కావడం లేదని కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పనులు త్వరగా చేపట్టాలని కార్పొరేటర్ జలమండలి మేనేజర్ వాహినిని కోరారు. కాలనీ అధ్యక్షుడు కాశీపతి, రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, జలమండలి సిబ్బంది బాలు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

సంతోష్‌నగర్: భార్యతో గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం ఈ ఘటన జరిగింది. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... హఫీజ్‌బాబానగర్ ప్రాంతానికి చెందిన సమీనా భాను, మహ్మద్ అలీమ్ (45)దంపతులు. వీరికి ముగ్గురు ఆడ పిల్లలు సంతానం. అలీమ్ లేబర్‌గా, సమీనా టైలరింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇంటి అద్దెను చెల్లించలేక సమీనా భాను తన పుట్టింట్లోనే నివాసముంటోంది. మహ్మద్ అలీమ్ మద్యానికి బానిసై ప్రతి రోజూ తాగుతూ ఇంట్లో ఖర్చుల నిమిత్తం డబ్బులు ఇవ్వకపోవడంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో అలీమ్ మద్యం తాగి ఇంటికి రావడంతో దంపతుల మధ్య మరోసారి గొడవ జరిగింది. అనంతరం సమీనా పిల్లలతో కలిసి తన గదిలో నిద్రపోయింది. మంగళవారం ఉదయం 5.30 గంటలకు నిద్రలేచిన సమీనా భర్త అలీమ్ రూమ్‌లోకి వెళ్లి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు కంచన్‌బాగ్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి


హస్తినాపురంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరితగతిన పూర్తి కావడమే కాకుండా పనులలో నాణ్యతాప్రమాణాలు మెరుగుపడతాయని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న వరదనీటి కాలువల నిర్మాణ పనులను ఆయా కాలనీల ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరదనీటి కాలువల నిర్మాణాలు పూర్తయితే చాలా ప్రాంతాలలో ముంపు సమస్య పరిష్కారమవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారులు , కాంట్రాక్టర్లు నిబద్ధతతో పనులు పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నరసింహ, మమత, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి: చెన్నోజు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

హస్తినాపురం: రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థలకు గత ప్రభుత్వం అండగా నిలవడంతో గత పదేళ్లుగా దోపిడీకి తెరలేపాయని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు ఆరోపించారు. హస్తినాపురంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో కార్పొరేట్ విద్యను ప్రక్షాళన చేసి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పేదలకు ప్రవేశం లేని కార్పొరేట్ పాఠశాలలను ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరం నుంచి రద్దు చేయాలన్నారు. నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలు తెలంగాణ ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నా గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. నిరుపేద తల్లిదండ్రులకు మోయలేని భారంగా మారిన ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాల్సిన అవసరం ఉందని, తెలంగాణ రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ కమిటీని వేసి పేదలకు న్యాయం చేయాలని శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సమావేశంలో గంగుల నర్సింహారెడ్డి, నదిగామ వెంకటేశ్, ఎ.వెంకటేశ్, యాదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

లార్డ్స్ స్కూల్‌లో ఆటలపై అవగాహన



క్రీడలపై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్ లార్డ్స్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు క్రీడలపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించింది. విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప మాట్లాడుతూ.. చిన్న పిల్లలు చిచ్చర పిడుగులు మనం ఏది నేర్పితే అదే అనుసరిస్తారన్నారు. పెరుగుతున్న విద్యాప్రమాణాలను దృష్టిలో పెట్టుకుని దానికి అనుగుణంగా విద్యాబోధన చేస్తున్నట్లు వివరించారు. క్రీడలు శరీరానికి, ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడతాయో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇప్పటి నుంచే బీజం నాటితే భవిష్యత్‌లో అభివృద్ధి పథంలో నడుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీన్ సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ కొండల్ రావు, ఇన్‌చార్జి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో ఇప్పటి వరకు ప్రభుత్వ భూముల కబ్జాలు కొనసాగుతుండగా.. తాజాగా ప్రైవేట్ స్థలాలకు కూడా రక్షణ లేకుండా పోతోంది. ఓ ప్రార్థనా మందిరానికి సంబంధించిన స్థలంలో రాత్రికి రాత్రే నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని అధికారులు మంగళవారం కూల్చివేశారు. అధికారుల వివరాల మేరకు.. జల్‌పల్లి గ్రామం పార్థివాడలోని 26, 27 సర్వే నంబర్లలో 2,025 గజాల స్థలాన్ని 1999లో సయ్యద్ అబ్దుల్ సమద్ ఖాద్రీ అనే వ్యక్తి పెద్ద గులాబ్ సింగ్, చిన్న గులాబ్ సింగ్, బాల్‌సింగ్, లక్ష్మి, రామన్ బాబు, శేషారావు, రాంబాబుల నుంచి కొనుగోలు చేశారు. ఆ స్థలంలో బేస్‌మెంట్ నిర్మాణంతో పాటు ప్రార్థనా మందిరానికి సంబంధించిన స్థలమని సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా ఓంకార్ మరి కొందరితో కలిసి అక్కడే తిష్టవేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు. రౌడీమూకలను స్థలంలో దించి యజమానులను బెదిరిస్తున్నారు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు పహాడీషరీఫ్ పోలీసులు, జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ ఎస్.వసంత ఆదేశాలతో టీపీవో హబీబున్నీసా పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. అడ్డుకునేందుకు యత్నించిన వారిని పోలీసులు అక్కడి నుంచి పంపించి వేశారు.

దత్తాత్రేయ జయంతి ఉత్సవాలు ప్రారంభం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అలకాపురిలోని శృంగేరి శంకరమఠంలో గురు దత్తాత్రేయ జయంతి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో గణపతి పూజ, విశేష మండప ఆరాధాన, అర్చన, శ్రీదత్తాత్రేయ స్వామి పాదుకులకు సహస్ర నామార్చన, గురుచరిత్ర పారాయణం, దత్త భావసుధారస స్తోత్రం, సిద్ధమంగళ స్తోత్ర పారాయణం నిర్వహించారు. పిలిస్తే పలికే దేవుడు దత్తాత్రేయుడు అని ఆలయ వేద పండితులు అన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ చరిత్రను వివరించారు. కార్యక్రమంలో శృంగేరి శంకరమఠం బ్రాంచ్ హెడ్ కేవీ శ్రీనివాస్, గురుసేవాధురీణ వీఆర్ గౌరీ శంకర్, విశ్వనాథ శోభనాద్రి, సూర్యనారాయణరావు, గౌరీ భాస్కర్, ముదికొండ శంకర శర్మ, సూరి వ్యాస్‌కుమార్, నరసింహమూర్తి, సుధాకార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి


సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

నాగోలు: ప్రభుత్వం పెన్షనర్లపై చిన్న చూపు చూడటం తగదని, వృద్ధాప్య దశలో వారికి అవసరమైన అన్ని సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాగోలు శాఖ ఆధ్వర్యంలో నాగోలు కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో ఆల్ ఇండియా పెన్షనర్స్ డే, సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ, పెన్షనర్లకు ప్రతినెలా మొదటి తేదీన వారి అకౌంట్లలో పెన్షన్ డబ్బు జమ చేయాలని, అన్ని కార్పొరేటర్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందజేయాలని కోరారు. కోశాధికారి అశోక్ కుమార్‌రావు మాట్లాడుతూ, పెన్షనర్లు తమ బేసిక్ పెన్షన్‌తో ఒక శాతం కంట్రిబ్యూట్ చేయడానికి సిద్ధంగా ఉన్నారని, సీపీపీని 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు. పెన్షనర్లకు ఆర్టీసీలో బస్సుల్లో 30 శాతం రాయితీ కోరారు. అనంతరం సీనియర్ పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైవీఎం సుబ్బారావు, కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి జగదీశ్వర్, నాగోలు శాఖ బాధ్యులు ఎం.నరసింహారెడ్డి, కోటిరెడ్డి, జగన్‌మోహన్‌రావు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రైతుబజార్‌కు సెలవు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతుబజార్‌కు నేడు సెలవు అని రైతుబజార్ ఈఓ స్రవంతి తెలిపారు. ప్రతి నెల మూడవ బుధవారం సెలవు ఉన్నందున ఈరోజు రైతు బజార్‌లో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవన్నారు. గురువారం యథావిధిగా రైతుబజార్ పని చేస్తుందన్నారు.

పాఠశాలలో సామూహిక పద్యార్చన

తానా ఆధ్వర్యంలో పోటీలు

మీర్‌పేట: ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఆధ్వర్యంలో విశ్వమాతరంలో భాగంగా మంగళవారం మీర్‌పేట ఆర్ఎన్‌రెడ్డినగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శాంతి సద్భావన యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సామూహిక పద్యార్చన చేశారు. పాఠశాల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ వంద దేశాల్లో దాదాపు 10 లక్షల విద్యార్థులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ఇందులో తమ పాఠశాల పాలు పంచుకోవడం అభినందనీయమని అన్నారు. జన్మనిచ్చిన అమ్మ, జీవనానికి ఆసరా ఇచ్చిన నాన్న, జీవిత పాఠాలు నేర్పిన గురువుల గురించిన శతక పద్యాలను విద్యార్థులు ఆసక్తి చూపుతూ పద్యార్చన చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులు

కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి


సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాంరెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయని అల్మాస్‌గూడలోని 24వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లకు హెచ్ఎండీఏ నిధులను రూ.2.5 కోట్లు మంజూరు చేయించడంతో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని కార్పొరేటర్ మంగళవారం తెలిపారు. రాజీవ్ గృహకల్ప నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు అక్కడి నుంచి ఆర్అండ్‌బీ రోడ్డుతో పాటు కోమటికుంట చెరువుకట్టపై ఉన్న శివాజీ చౌక్ వరకు సీసీ రోడ్డు పనులు సాగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా నిధుల మంజూరుకు పూర్తి సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డికి కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బైరెడ్డి, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరిస్తాం

ఎమ్మెల్యే సబితారెడ్డి


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సిబ్బంది పాత్ర కీలకమని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పహాడీషరీఫ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఆమె మహిళ, శిశు సంక్షేమంపై ఐసీడీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. 23 ఏళ్ల క్రితం అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వస్తే.. వంటింటి నుంచి వచ్చిన మహిళ ఏం రాణిస్తారని చాలా వరకు విమర్శించారని, ఇంటిని చక్కదిద్దే మహిళలు సాధించలేనిదంటూ ఏమిలేదన్నారు. అమ్మ, అమ్మమ్మ పాత్రలు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సమాజంలో పోషిస్తున్నారన్నారు. వారి సేవలు వెల కట్టలేనివన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు, ఫర్నీచర్ తదితర సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. సెంటర్ల వారీగా సమగ్ర నివేదికలను తయారు చేయాలని సూచించారు. సమీక్షలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కార్పొరేటర్ లావణ్య, మహేశ్వరం, హయత్ నగర్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఎమ్మెల్యే

తుక్కుగూడ: సూర్యగిరి ఎల్లమ్మ ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎప్పుడూ ఉండాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆకాంక్షించారు. ఆమె మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, కానుకలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్యయాదవ్, ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

పహాడీషరీఫ్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం హర్యానాయక్ తండాకు చెందిన కెతావత్ నరేందర్ అలియాస్ రవి(45) నాలుగేళ్ల క్రితం కుటుంబంతో సహా తుక్కుగూడలో ఉంటున్నాడు. ఈ నెల 18 సాయంత్రం నుంచి రవి కనిపించడం లేదంటూ అతని సోదరుడు మల్లేష్ బంధువులకు వాకాబు చేశాడు. మంగళవారం మధ్యాహ్నం తుక్కుగూడలోని శివాజీ వైన్స్ సమీపంలో ఉన్న టేబుల్‌పై రవి మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రవి మరణానికి అతని భార్య సరోజ కారణమంటూ సోదరుడు మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉదయం ఛాతి నొప్పితో బాధ పడినట్లు గమనించి అనారోగ్యంతోనే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.